అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి - పాతపట్నం

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు హెచ్చరించారు. మండలంలోని బూరగాంలో రేషన్ డిపో, ఎండియు వాహనం, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, సిఎస్‌డిటి ప్రసాదరావు, చక్రవర్తి, ఐసిడిఎస్, ఎంఇఒ తిరుమలరావు, తూనికలు కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

కన్నీటి గాథ...

కవిటి మండలం మధ్యపుట్టుగకు చెందిన 42 ఏళ్ల కొరికాన తిరుపతి చలాకీగా ఉండే మనిషి. తనకున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు నెలల కిందట వచ్చిన జ్వరం ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో, వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. అప్పటికే అతనికి ఉన్న కిడ్నీ వ్యాధి చేయిదాటిపోయిందని, డయాలసిస్ చేయించుకోకపోతే ప్రమాదమని వైద్యులు తేల్చేశారు. దీంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో వారానికి రెండు రోజులు డయాలసిస్ చేసుకుంటున్నాడు. ఇలా అతనికొక్కరికే కాదు... పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో కొన్ని వందల కుటుంబాల కన్నీటి వ్యథ.

ఎలా వస్తుందో తెలీదు.. ఎందుకు వస్తుందో అసలే తెలీదు. చాలామందికి చివరి నిమిషం వరకూ తమకు కిడ్నీ వ్యాధి ఉందని తెలియకపోవడం ఎవరు కాదన్నా నమ్మలేని నిజం. ఉద్యానవనం లాంటి ఉద్దానం ప్రాంతంలో చాపకింద నీరులా వ్యాపించిన కిడ్నీ మహమ్మారికి కొన్ని వందల కుటుంబాలు బలైతే.. కొన్ని వేల మంది రోగులు వ్యాధితో పోరాడుతున్నారు. శ్రీలంక, మధ్య అమెరికా, జపాన్, జర్మనీ, ఇటలీతో పాటు భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో కిడ్నీ బాధితులు ఉన్నా, ఉద్దాన ప్రాంతమే ప్రాచుర్యంలోకి రావడానికి అనేక కారణాలు. కారణం ఏదైనా కిడ్నీలు కరిగిపోతున్నాయి.. మనుషులు కనుమరుగవుతున్నారనేది దాయలేని నిజం. ఈనెల 13వ తేదీన ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

కిడ్నీ రోగుల వ్యథ



- కబళిస్తున్న కిడ్నీ వ్యాధి
- రోగులతో నిండిపోతున్న బెడ్‌లు
- పిహెచ్‌సిలకు మందులు కోత

ప్రజాశక్తి - కవిటి

ఉద్దానం ప్రాంతంలో పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో 2017 నుంచి 2024 అక్టోబర్ వరకు 3,41,207 మందిని పరీక్షిస్తే అందులో 23,086 మంది కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నట్టు గుర్తించారు. అదే సమయంలో 2023 డిసెంబర్ వరకు 14,202 మంది కిడ్నీ వ్యాధితో చనిపోయారు. అక్కడ్నుంచి 2024 నవంబర్ 30 వరకు 496మంది ఈ వ్యాధితో చనిపోయినట్లు తెలిసింది. ఇక ఉద్దానం ప్రాంతంలో 18 పిహెచ్‌సిలు, 5 యుపిహెచ్‌సిలు, ఆరు పిహెచ్‌సిల పరిధిలో కిడ్నీ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు టెక్కలి, పలాస, హరిపురం, సోంపేట, కవిటి డయాలసిస్ సెంటర్లలో 538 మంది రోగులు డయాలసిస్ చేసుకుంటున్నారు.

పిహెచ్‌సిలకు మందుల కోత

ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకోవాల్సింది పోయి ఇప్పటివరకు పిహెచ్‌సిలకు సరఫరా చేస్తున్న మందులను టిడిపి కూటమి ప్రభుత్వం ఆపేసింది. గత ప్రభుత్వం ఉద్దానం ప్రాంతంలోని డయాలసిస్ యూనిట్లు ఉన్న ఆస్పత్రులతో పాటు అన్ని పిహెచ్‌సిలకు 12 రకాల మందులను సరఫరా చేసేది. అందులో కేవలం రెండు రకాల మందులు మాత్రమే పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉన్నాయి. సిహెచ్‌సిల్లో కొంతమేర అందుబాటులో ఉన్నా, అవీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. కిడ్నీ రోగులకు అత్యవసరమైన ఫైబెక్స్ స్టట్, సోడియం బైకార్బోనేట్, సెల్వర్‌మర్ వంటి మందులు అడపాదడపా వస్తున్నాయి. బడ్జెట్ లేదనే పేరుతో పిహెచ్‌సిలకు కోత పెట్టి డయాలసిస్ యూనిట్లు ఉన్న ఆసుపత్రులకు మాత్రమే అందిస్తోంది. పలాస కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు పలు సిహెచ్‌సిలకు తాజాగా సోడియం బైకార్బొనేట్ 500 ఎంజి మాత్రల సరఫరా నిలిచిపోయింది.

ఒకరు చనిపోతేనే ఇంకొకరికి బెడ్

డయాలసిస్ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.పది వేల పింఛను ఆర్థికంగా కొంత ఊరట కలిగిస్తోంది. అయితే, సీరం క్రియాటినిన్ 5 పాయింట్లు దాటిన వారికి పింఛను మంజూరులో గానీ కిడ్నీ బాధితులకు పూర్తిస్థాయిలో మందుల సరఫరాలో కానీ ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. ముఖ్యంగా క్రియాటినిన్ 5 పాయింట్లు దాటిన రోగులు పింఛను మంజూరు కోసం పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ఇంత బాధపడినా వంద మందిలో కనీసం పది మందికీ పింఛను మంజూరైన పరిస్థితి లేదు. ఇక డయాలసిస్ రోగుల పరిస్థితి దయనీయం.

అందుబాటులో సరిపోయే బెడ్లు లేకపోవడంతో పలాస, శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారికి దగ్గర్లో బెడ్ దొరకాలంటే ఎవరో ఒక డయాలసిస్ రోగి చనిపోతేనే అవకాశమున్న దయనీయ పరిస్థితి. దీంతో ఎంతోమంది డయాలసిస్ రోగులు అటు ఆర్థికంగా ఇటు మానసికంగా నరకయాతన అనుభవిస్తున్నారు. కవిటిలో 19, సోంపేటలో 19 బెడ్లు అందుబాటులో ఉంటే 238 రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. బెడ్ కోసం సుమారు 20 మందికి పైగా వేచిచూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కవిటి, సోంపేట డయాలసిస్ కేంద్రాల్లో బెడ్లు పెంచడమే కాకుండా, ఇచ్ఛాపురంలో కొత్తగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే రోగులకు కొంత ఊరట లభిస్తుంది.

అందుబాటులో లేని నెఫ్రాలజిస్ట్

కిడ్నీ రోగాలను పరీక్షించే నెఫ్రాలజీ వైద్యుని నియామకంలో ప్రభుత్వాల తాత్సారం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో కిడ్నీ రోగులు ఉద్దానం ప్రాంతం నుంచి నెఫ్రాలజీ వైద్యుని కలిసేందుకు విశాఖపట్నం, శ్రీకాకుళం పయనమవుతున్నారు. అదే స్థానికంగా ఓ నెఫ్రాలజిస్ట్ అందుబాటులో ఉంటే రోగులకు ఆర్థికంగానే కాకుండా మానసికంగానూ సాంత్వన లభిస్తుంది.

చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు

పిల్లాపాపలతో కళకళలాడుతున్న ఎన్నో కుటుంబాలు ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ మహమ్మారికి బలయ్యాయి. కుటుంబంలో ఒకరికి కిడ్నీ వ్యాధి సోకితే అటు ఆర్థికంగా, ఇటు మానసికంగా ఆ కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతం. ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రాణాన్ని కాపాడుకోలేని స్థితిలోకి చేరుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా కిడ్నీ వ్యాధికి గురైన పేదల పరిస్థితి దయనీయం. రెక్కాడితే గానీ డొక్కాడని ఎన్నో కుటుంబాలు ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. పదేళ్ల బాలుడి నుంచి పండు ముదుసలి వరకు ఎవరినీ వదలని ఈ మహమ్మారికి పిట్టల్లా జనాలు రాలిపోతుంటే పల్లెలు బోసిపోతున్నాయి.

కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వైసిపి నాయకులు

యువత జీవితాలతో చెలగాటం

- నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్
- కలెక్టరేట్ వద్ద 'యువత పోరు'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల జీవితాలతో టిడిపి కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు రూ.మూడు వేలు భృతి ఇవ్వాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి చేపట్టిన యువత పోరులో భాగంగా నిరుద్యోగులు, విద్యార్థులు, వైసిపి శ్రేణులు నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం, చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. మెగా డిఎస్‌సి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి సంతకానికి నేటికీ అతీగతి లేకుండా పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం విద్యార్థులను అన్నివిధాలుగా ఆదుకుందని చెప్పారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నాటి పథకాలను అమలు చేయకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేశారని విమర్శించారు. దీనివల్ల పేద విద్యార్థులకు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. మరోవైపు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాట్లాడడం లేదన్నారు.

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ విద్య, వైద్యరంగంలో ఉన్న రూ.నాలుగు వేల కోట్ల బకాయిలు చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేష్ రాసిన రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, తమ్మినేని చిరంజీవి నాగ్, ఎం.వి స్వరూప్, వైసిపి, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

శ్రీకాకుళం : ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు సంసిద్ధత, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, పి4 మోడల్ సర్వే, తదితర అంశాలపై కలెక్టర్, ఎస్‌పితో సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర చర్యలపై సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సిఎస్ నిర్దేశించిన అంశాలపై సమగ్ర నివేదికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ముందస్తు పరిశీలన చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిపిఒ భారతి సౌజన్య, డిఇఒ తిరుమల చైతన్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ఆఫ్‌షోర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారు?

- బడ్జెట్‌లో మొక్కుబడి కేటాయింపులు
- జిల్లాపై నిర్లక్ష్యానికి ఇదో నిదర్శనం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - నందిగాం

ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా చైతన్య యాత్రల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ 2007లో ప్రారంభించి నేటికి 18 ఏళ్లు పూర్తయినా చాపర నుంచి రేగులపాడుకు 13 కిలోమీటర్లు కాగా, కనీసం అందులో సగం కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. 2007లో రూ.127 కోట్లు అంచనా వ్యయమైతే, నేడు రూ.852 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎందుకు తగిన నిధులు కేటాయించలేదో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు కనీసం రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొక్కుబడి కేటాయింపులు పాత పనుల బిల్లులకే సరిపోతుందని తెలిపారు. జిల్లాపై నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే మెళియాపుట్టి మండలంలో 3,890 ఎకరాలు, పలాస మండలంలో 6,800 ఎకరాలు, నందిగాం మండలంలో 12,090 ఎకరాలు, టెక్కలి మండలంలో 1,820 ఎకరాలు మొత్తం 24,600 ఎకరాల భూమికి సాగునీరుతో పాటుగా పలాసకు తాగునీరు ఇవ్వవచ్చని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. జిల్లాలో గిరిజన ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాలిన సాంబమూర్తి, హనుమంతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకాలు

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో జెడ్‌పి యాజమాన్యం పరిధిలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు సామాజిక భద్రతలో భాగంగా కారుణ్య నియామకాలు చేపట్టారు. నియామక పత్రాలను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం అందజేశారు. సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో పాలక దమయంతి, జెడ్‌పి కార్యాలయంలో మక్క అప్పలనాయుడు, జెడ్‌పి హైస్కూల్ కొలిగాంలో లండ కోటేశ్వరరావును నియమించినట్లు జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా తెలిపారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పి పరిపాలనాధికారి రమేష్, ఉద్యోగ సంఘ నాయకులు దుంపల అప్పన్న, మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 149 పరీక్షా కేంద్రాలు

జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

ప్రజాశక్తి - పొందూరు

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల సముదాయాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలకు 28,984 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. వేసవి పరిస్థితుల దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో హాల్‌టిక్కెట్లు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్ టిక్కెట్ల అధ్యయన కేంద్రాల్లో, ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ (www.apopenschool.org)లో తీసుకోవాలని తెలిపారు. ఫొటో పడని హాల్ టిక్కెట్స్ పరీక్ష ప్రవేశానికి అనర్హులని స్పష్టం చేశారు. అటువంటి విద్యార్థులు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. సందేహాల నివృత్తికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8328269673, 9505678655 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 807 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు.

అదనపు ధాన్యం కొనుగోలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన చెందిన రైతుల నుంచి అదనంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధశారం ఆయన మాట్లాడుతూ ఇంకా రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నట్లు పలువురు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ సమస్యపై ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు సంబంధిత శాఖ మంత్రులకు తెలియజేయగా, ఆమదాలవలస నియోజకవర్గంలో అదనంగా రైతుల నుంచి లక్ష క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. పొందూరు మండలంలో 35వేల క్వింటాలు, ఆమదాలవలస మండలంలో 25వేల క్వింటాలు, బూర్జ మండలంలో 25వేల క్వింటాలు, సరుబుజ్జిలి మండలంలో 15 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎసిబికి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

రూ.25 వేలు లంచంతో పట్టుబడిన బాలరాజు

ప్రజాశక్తి - అరసవల్లి

ఎసిబికి పట్టుబడిన బాలరాజు

జిల్లా కేంద్రంలోని బిసి వెల్ఫేర్ సీనియర్ అసిస్టెంట్ బి.బాలరాజు అవినీతి నిరోధక శాఖ అధికారులకు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. బిల్లులు ప్రాసెస్ చేసేందుకు రూ.25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఎసిబి డిఎస్‌పి బి.వి.ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ఇంక్రిమెంట్లు, ఎంట్రీ బిల్లుల ప్రాసెస్ చేసేందుకు అదే శాఖకు చెందిన పలు బిసి హాస్టళ్లలో పనిచేసే అటెండర్, కుక్‌లను రూ.25 వేలు లంచాన్ని బిసి వెల్ఫేర్ సీనియర్ అసిస్టెంట్ బాలరాజు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడానికి ఇష్టం లేక వారు శ్రీకాకుళం నగరంలోని ఎసిబి అధికారులను ఆశ్రయించారు. పథకం ప్రకారం డబ్బులు ఇచ్చేందుకు బుధవారం సాయంత్రం బాలరాజుకు ఫోన్ చేయగా, శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి రావాలని వారికి సూచించాడు. అక్కడే మాటు వేసిన ఎసిబి అధికారులు లంచం సొమ్మును బాలరాజు అందుకుంటుండగా పట్టుకున్నారు. ఈ క్రమంలో బాలరాజు తన వద్ద ఉన్న సొమ్మును తుప్పల్లో విసిరేశాడు. బాలరాజును అక్కడునుంచి బిసి వెల్ఫేర్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు. బిసి వెల్ఫేర్‌శాఖలో 2016లో చోటుచేసుకున్న ఉపకార వేతనాల అవకతవకల్లో ఈయనపై ఎసిబి కేసు కూడా ఉందని తెలిపారు. దాడుల్లో సిఐలు రమణ, కె.భాస్కరరావు, ఎస్ఐ సత్యారావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికీ గృహ నిర్మాణం లక్ష్యంలో భాగంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వం జిఒఆర్‌టి నంబరు 9 విడుదల చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటిజి లబ్ధిదారులకు రూ.లక్ష అదనంగా అందజేయనున్నట్టు వెల్లడించారు. గతేడాది డిసెంబరు పదో తేదీ నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే ఈ సాయం అందించడానికి వీలుందని స్పష్టం చేశారు. పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకనుగుణంగా అదనపు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు త్వరితగతిన అందజేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ ఏడాది మే నెలాఖరుకు 12,685 ఇళ్లను పూర్తి చేయాలని... ఎంపిడిఒలు, గృహనిర్మాణ శాఖ ఎఇలు పర్యవేక్షించాలన్నారు.

ఏప్రిల్ నెలాఖరు వరకే అవకాశం

ఏప్రిల్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే అదనపు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ ఎమెనిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన ప్రతి ఇంటినీ తనిఖీ చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణ దశ ఫొటోను తీసుకుంటారని తెలిపారు. అదనపు సాయంపై విస్తృత ప్రచారం చేపట్టి ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా, లబ్ధిదారులు ప్రయోజనం పొందే విదంగా తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

బాబోయ్.. ఇంత ఒత్తిడా!

ప్రజాశక్తి - కవిటి

ఇటీవల కాలంలో విపరీతమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నామని, కనీసం కుటుంబానికి సమయం కేటాయించలేని పరిస్థితి ఏర్పడిందని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వాపోయారు. పనిఒత్తిడి తగ్గించాలంటూ ఎంపిడిఒ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహిలకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శుల మండల అధ్యక్షుడు నెమలిపురి మన్మధరావు మాట్లాడుతూ ప్రస్తుతం 13 రకాల సర్వేలు నిర్వహిస్తున్నామని, వాటికి అదనంగా ఇంటి పన్ను వసూలు, మరో 25 రకాల ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలతో తలమునకలై ఉన్నట్లు తెలిపారు. దీంతో కనీసం సెలవురోజు కూడా ఇంటి దగ్గర ఉండే పరిస్థితి లేదని వాపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో చాలామంది కార్యదర్శులు ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పనిఒత్తిడి తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ జి.వీరభద్రస్వామి, కార్యదర్శులు మూల మోహనరావు, అబ్దుల్‌ఖాన్, పి.జ్యోతిలక్ష్మి, రత్నాల చంద్రశేఖర్, మామిడి హరికృష్ణ, నిమ్మన గుణవతి, రమేష్ బెహరా, అట్టాడ విజయ్‌కుమార్, వి.రూప, చిన్నారి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ నాయుడు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

బూర్జ : మండల కేంద్రంలో రూ.24 లక్షలతో పలు రోడ్ల నిర్మాణాలకు ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట్ల రూపాయలతో గ్రామీణ రోడ్లను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పక్కా రహదారులు ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఎంపిడిఒ తిరుపతిరావు, బిసి సాధికార సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వ్యాపారి వెంకటేశ్, ఎంపిటిసి పోలినాయుడు, సర్పంచ్ వేగు అనురాధ, టిడిపి నాయకులు గిరీష్ భోగిరాజు, కార్యదర్శి పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

పొందూరు: ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయవంతం చేయాలని జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు ప్రతిఒక్కరూ తరలిరావాలన్నారు.

కౌన్సిలర్ అనర్హత నోటీసుపై దుమారం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ ఏడో వార్డు వైసిపి కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి విధి నిర్వహణ లోపించిందని, వార్డులో అక్రమ కట్టాల నివారించడంలో అలక్ష్యం వహించడం, తదితర కారణాలు వల్ల ఆమె సభ్యత్వ రద్దు ఎందుకు తొలగించకూడదని ఇన్‌ఛార్జి కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్ గత నెల నోటీసులు జారీ చేశారు. దీంతో వైసిపిలో ఒక్కసారిగా అలజడి రేగింది. కీలకమైన నోటీసు జారీ చేస్తున్నప్పుడు సంబంధిత ప్రథమ పౌరులు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మికి తెలియకుండా నోటీసు జారీ చేస్తారా?. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కి పత్రికా ప్రతినిధులు వివరణ కోరినప్పుడు తనకి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉన్న సమయంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారి అనర్హత నోటీసు జారీ చేయడం చర్చనీయాంశమైంది. నోటీస్ అందుకున్న లాభాల స్వర్ణమణి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కౌన్సిల్ మెంబరుగా ఎపి మున్సిపల్ చట్టం-1965లోని సెక్షన్ ప్రకారం కౌన్సిలర్ సభ్యత్వానికి అనర్హత పొంది ఉన్నానని తెలియపరుస్తూ... వాటితో అనర్హతకు సంబంధం లేని వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 25న కమిషనర్ జారీ చేసిన సమాచారం ఫిబ్రవరి 27 రిజిస్టర్డ్ పోస్టు ద్వారా అందిందన్నారు. దానిపై తాను ఈ నెల 10న 12 పేజీలు సమాధానానికి 30 పేజీలు వాత పూర్వక ఆధారాలు, ఓ వీడియో ఆధారం జతపరుస్తూ... రిజిస్టర్డ్ పోస్టు ద్వారా కమిషనర్‌కు పంపించానని తెలిపారు. తన వార్డులో రోడ్లు, డ్రెయిన్లు మినహాయించి తనకు తెలిసి తప్పితే ఏ ప్రభుత్వ, మున్సిపాలిటీ స్థలాలు లేవన్నారు. మున్సిపల్, ఇతర అధికారి గాని ఏదైన ప్రభుత్వ, మున్సిపాలిటీ స్థలాలు ఆక్రమణకు గురియైనట్లు, వాటిని తొలగించేందుకు సహకరించాలని తనను ఎప్పుడూ కోరలేదన్నారు. సదరు నోటీస్ కేవలం తను నిర్లక్ష్యం చేశానని మాత్రమే ఆరోపించారు తప్ప అక్రమ కట్టడాలు తొలగింపులో సహాయ నిరాకరణ చేశానని వివరాలు ఇవ్వలేదన్నారు. 2022-23లో 14వ ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లతో ఉప్పలవీధి, పప్పలవీధి, కొండ వీధుల్లో సిసి రోడ్లు నిర్మించినప్పుడు దగ్గర ఉన్నారని అన్నారు. ఆ వీధుల్లో ఉన్న వారికి డ్రెయిన్లపై వేసిన పేట్లను తొలగించామన్నారు. వార్డు అక్రమ కట్టడాలు, నిర్మాణాలు తొలగించడంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదని పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్‌గా సెక్షన్ 53 (2)లో తనకు కేవలం సమస్యలు, సూచనలు కౌన్సిల్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లే హక్కు మాత్రమే ఉందన్నారు. అంతేకాని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకునే హక్కు తనకు లేదన్నారు. అది కేవలం కమిషనర్‌కు మాత్రమే ఉందన్నారు. తాను పలుమార్లు తన వార్డు పరిధిలో అక్రమ కట్టడాల గురించి కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. చర్యలు తీసుకోవాల్సిన కమిషనర్ మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కి ఎలాంటి సంబంధం లేని తన భర్తపైన ఆరోపణలు చేశారని అన్నారు. నాలుగేళ్లలో వంద నుంచి 150 వరకు ఆర్‌టిఐ దరఖాస్తులు కమిషనర్ చేసి ఉన్నారని తెలిపారు. ప్రతినెలా మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ వివరాలు సమాచార హక్కు ద్వారా తెలుసుకుంటున్నారని అన్నారు. మున్సిపాలిటీ బాగోతం ఈ ఏడాది జనవరి 23న ప్రభుత్వానికి, అవినీతి శాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖకు ఫిర్యాదు చేశానన్నారు. ఈ ఏడాది జనవరి 1న బడ్జెట్ సమావేశంలో టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పడిపోవడం, అక్రమ నిర్మాణాలపై జరిమానా వేయకపోవడంపై నిలదీశానని అన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకొని కక్షసాధింపు చర్యల్లో భాగంగా కమిషనర్‌పైన పేర్కొన్న సమాచారం, నోటీస్ జారీ చేశారని ఆరోపించారు. వీటిపై 30 ఆధారాలతో కమిషనర్‌కు జవాబు ఇచ్చినట్లు తెలిపారు.

నినాదాలతో బయటపడిన గ్రూపుల గోల

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో రాజకీయాలకు అన్ని నియోజకవర్గాల్లో కంటే ఆమదాలవలసకు ఒక ప్రత్యేకత గుర్తింపు ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. నియోజకవర్గంలో వైసిపి కొంతకాలంగా నడుస్తున్న గ్రూపుల గోల యువత పోరులో భాగంగా బుధవారం బయటపడింది. యువత పోరు, వైసిపి ఆవిర్భావ దినోత్సవం కావడంతో పట్టణ శివారులో ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ముందుగా నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ తమ అనుచరులతో అక్కడకు చేరుకొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ సమయంలో పలువురు కార్యకర్తలు రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పేర్లతో నినాదాలు చేశారు. ఈ సమయంలో మున్సిపాలిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు చింతాడ రవికుమార్ నాయకత్వం వర్ధిల్లాలని నినాదం చేశారు. దీనిపై మాజీ స్పీకర్ తమ్మినేని అసహనం వ్యక్తం చేస్తూ చిరాకుపడారు. దీంతో అక్కడ ఉన్న నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మున్సిపాలిటీకి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు గ్రూపుల గోలపై చర్చించుకున్నారు.

ర్యాలీ అడ్డుకట్ట

చింతాడ రవికుమార్ తన అనుచరులతో కలెక్టరేట్ వద్ద ర్వహించిన యువత పోరుకు ర్యాలీగా వెళ్తున్నారు. ఎస్ఐ ఎస్.బాలరాజు ఆధ్వర్యాన పోలీసులు ర్యాలీ నిర్వహించడానికి అనుమతులు లేవని, విద్యార్థులు ఉంటే విడి విడిగా వెళ్లి కార్యక్రమం చేసుకోవచ్చు అంటూ సూచించారు. ఇంతలో ఆమదాలవలస మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ తన అనుచరులతో అక్కడకు చేరుకొని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. దీంతో శ్రీకాకుళం వైపు, పాలకొండ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు స్తంభించాయి.

ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

బడ్జెట్ సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు డుమ్మా

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పాలకవర్గంలో సభ్యులుగా ఉన్న వైసిపి కౌన్సిలర్లు బుధవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొట్టారు. దీంతో సమావేశం ముచ్చటగా మూడో సారి వాయిదా పడింది. మున్సిపల్

కోరం లేక వాయిదా

కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 12 మంది సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరుకావడంతో కోరం లేని పరిస్థితిల్లో చైర్మన్ వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడ్జెట్ సమావేశం జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహించామన్నారు. ఆయా సమయాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. కోరానికి 17 మంది సభ్యులు హాజరు ఉండాల్సి ఉండగా, 12 మంది సభ్యులు హాజరుకావడంతో సభా నిబంధనలు మేరకు వాయిదా వేశామన్నారు. మూడు సార్లు సమావేశం వాయిదా పడడంతో కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రామారావు, సభ్యులు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, తంగుడు ఆశాలత, జోగ త్రివేణి, డిక్కల ఆనందరావు, సవర సోమేశ్వరరావు, బల్ల రేవతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పాతపట్నం

మధు మృతదేహం

మండలంలోని తెంబూరు సమీపం లింగుబంద వద్ద బుధవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని లాబరకు చెందిన ముగ్గురు యువకులు తెంబూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. గంగువాడ నుంచి పురోహితుడు కోటబొమ్మాళి మండలం జమచక్రం బైక్ వెళ్తున్నాడు. లింగుబంద చెరువు వద్ద ఎదురెదురుగా రెండు బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లాబరకు చెందిన కనకాల మధు (25) ఘటనాస్థలంలో చనిపోయారు. ముగ్గురు గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సారవకోట మండలం జగన్నాథపురానికి చెందిన మరో యువకుడు మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న మధు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

పుస్తెలతాడు చోరీ

పలాస : పలాస-కాశీబుగ్గ కోసంగిపురానికి చెందిన దుంపల యశోద మెడలో ఉన్న రెండున్నర తులాలు పుస్తెలు తాడును గుర్తు తెలియని వ్యక్తి బుధవారం చోరీ చేశాడు. యశోద తన భర్త అప్పన్నకు కిడ్నీలు పాడవడంతో ఈ నెల 11న కిడీ ఆస్పత్రిలో చేర్పించింది. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో బట్టలు తెచ్చుకోవడానికి ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో పాతజాతీయ రహదారిలో నడిచి వెళుతుండగా... గుర్తుతెలియని వ్యక్తి ఎక్కడకు వెళతావని అడిగి స్కూటీపై ఎక్కించారు. ఇంటిలో దింపుతానిని నమ్మబలికి కోసంగిపురం వైపు వెళ్లకుండా శివాలయం వద్ద ఉన్న మట్టిరోడ్డుకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను బెదిరించి తన మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెలతాడు చోరీ చేసి పరారీ అయ్యాడు. అనంతరం తమ బంధువులకు విషయం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న బురగాన సింహాచల పాత్రో, సంజయ్ బెహరా అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20.310 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితులను బుధవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన ఇద్దరు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పట్టనంలో పోలీసులుపట్టుకున్నారని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టామన్నారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని వివేకానంద భారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ పేరాడ సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం అభినందించారు. యువతరం సేవా సమితి నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని, దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. టాలెంట్ టెస్టులో తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.గుణశేఖర్, జి.అక్షయ, ఎనిమిదో తరగతికి చెందిన బి.వర్షిణి, ఆరో తరగతి విద్యార్థి బి.రేష్మ, డ్రాయింగ్ పోటీల్లో పి.చాందిని, బి.ప్రశాంతి బహుమతులు సాధించారని తెలిపారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వణజనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న కరస్పాండెంట్ సోమేశ్వరరావు

పరీక్ష సామగ్రిని అందజేస్తున్న సూర శ్రీను

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- లావేరు, ఎచ్చెర్ల

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సామాజిక, వ్యాపార వేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. లావేరు మండలం అదపాక, తామాడ, ఎచ్చెర్లలోని ఎస్.ఎస్.ఆర్,పురం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు పదో తరగతి పునాది వంటిదన్నారు. ఇక్కడ ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటితే ఉన్నత చదువులకు బాటలు వేసుకోవచ్చునని సూచించారు. మంచి మార్కులతో ఉత్తమ లక్ష్యాలను సాధించి మీమీ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, షార్ప్ నర్స్, ఎరైజర్స్, స్కేల్స్, హాల్‌టిక్కెట్ పౌచ్‌లు అందించారు. ఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

దిగువశ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కవిటి: తరగతి గదిలో దిగువ శ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి బోధన సాగించాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి సూచించారు. రెండో పూట మండలంలోని ఆరు పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ బుధవారం నిర్వహించారు. బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్‌లో పాల్గొన్న మాట్లాడారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పూర్తి స్థాయిలో సిలబస్ పూర్తిచేయాలని సూచించారు. డ్రా బ్యాక్ విద్యార్థులపై దష్టిసారించి వారికి తరగతులు అలవాటుపడేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.రమణమూర్తి, ఆర్ఎస్ఎం తనూజ, డిఆర్‌పి జానకిరావు, జగన్, సిఆర్‌పి తులసి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

సరుబుజ్జిలి : పాఠశాల తరగతి గదిలో విద్యా నైపుణ్యాభివృద్ధికి క్లస్టర్ వనరుల కేంద్రాలు దోహదపడతాయని సమగ్ర శిక్ష అక్మిబియాన్ ఎపిసి పేడాడ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్లస్టర్ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఇడి కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, ప్రధానోపాధ్యాయులు కత్తిరి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పొందూరు : డాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఉత్సాహంగా... ఉల్లాసంగా

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించి ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. విద్యార్థులు సినీ పాటలకు డాన్స్ చేస్తూ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. తద్వారా అభివృద్ధికి దోహపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధించి ఉన్నతంగా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య అన్నారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వేసిన నృత్యాలు అలరించాయి.

మున్సిపాలిటీలో దాహం కేకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని 19 వార్డుల్లో ఎప్పటికప్పుడు పైపుల లీకులతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్ కూడలి వద్ద ప్రధాన రహదారిపై తాగునీటి పైపుకు లీకేజీ పడింది. మున్సిపల్ అధికారులు మరమ్మతు నిమిత్తం గుంతను తవ్వి విడిచిపెట్టేశారు. దీంతో రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురపాలక సంఘంలో 23 వార్డులకు గాను 19 వార్డులకు పైపులైన్ల ద్వారా, మిగిలిన నాలుగు వార్డులకు ట్రాక్టర్ల ద్వారా రెండు రోజులకొకసారి తాగునీరు అందిస్తున్నారు. పట్టణ ప్రాంతంలో తరచూ పైపుల లీకేజీ కారణంగా ప్రజలకు తాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమితుల పాలకవర్గ సమయంలో వంశధార నది నుంచి పట్టణ ప్రజలకు తాగునీరు అందించడానికి సుమారు 40 ఏళ్ల కిందట పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఆమదాలవలస పురపాలక సంఘంగా ఏర్పడిన 30 ఏళ్లు అవుతుంది. సమితుల కాలం నాటి పైపులైన్లను కొనసాగిస్తుండడం వల్ల రోజూ పైపుల లీకులు ఏర్పడుతున్నాయి. రోడ్డు మధ్యలో పైపుల లీకేజీ వల్ల మున్సిపల్ అధికారులు లీకేజీ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి భారీ గుంతలను తవ్వుతున్నారు. వాటిని సకాలంలో పూడ్చకపోవడంతో రోడ్డుపై సాగించే వాహనదారులు, ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పైపుల లీకేజీ వల్ల రహదారి ప్రాంతమంతా బురదమయంగా మారడం, మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టనన్ని రోజులు తాగునీటి ఇబ్బందుల తీవ్రత ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

కాలువ గుంతను తవ్వి విడిచిపెట్టిన అధికారులు

గృహ నిర్మాణాలకు నిధుల పెంపు

సమీక్షిస్తున్న కరుణాకరరావు

ప్రజాశక్తి- పాతపట్నం

గృహ నిర్మాణాల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు పెంచిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖ ఇంజినీరింగ్ అసిస్టెంటతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటిజి లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున నిధులు పెంచారని అన్నారు. బేస్‌మెంట్, రూఫ్ లెవెల్, కాంక్రీట్, కంప్లేషన్ వివిధ రకాల స్టేజ్‌ల్లో ఈ పెంచిన మొత్తాలను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. మే 31లోగా గృహ నిర్మాణాలను పూర్తికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ చంద్రకుమారి, గృహ నిర్మాణశాఖ ఎఇ సీతారాం, సచివాలయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

మెమోంటోను అందజేస్తున్న రుషిత

రుషితకు అభినందనలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జాతీయ సైన్స్ ఉత్సవాలు సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ పోటీల్లో కోటబొమ్మాళి బోయిన శారదగోవిందరాజులు బాలికల ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న నర్సిపురం రిషితకు ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్, ప్రధానోపాధ్యాయులు సిహెచ్.రమాదేవి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, రోజామణి, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, కళింగ కోమటి కన్వీనర్ బోయిన గోవిందరాజులు అభినందించారు.

ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లం పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్తలు, ఎంపిటిసి మాజీ సభ్యులు తామాడ గణపతి, భారతమ్మ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంపిపి నిమ్మన దాసు, నాయకులు బుధవారం గణపతి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్ బండారు, జి.విజయ్ కుమార్, రాజేష్ బుంగా, మొదలవలస వరలక్ష్మిలు 'ది పవర్ ఆఫ్ డేటా, ఎ గైడ్ టు డేటా బేస్ మేనే జ్మెంట్ సిస్టమ్స్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల ఆవరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం ఆవశ్యకతను డైరెక్టర్ వివరిస్తూ బిటెక్, డిగ్రీ, కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్న అన్ని విభాగాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్ఇ హెచ్ఒడి డాక్టర్ వై.రమేష్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

రాజగోపాలరావు జయంతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉత్తరాంధ్రలో అధికంగా ఉన్న కళింగలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపును మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. బుధవారం రాజగోపాలరావు 102వ జయంతి సందర్భంగా కొత్తరోడ్డు వద్ద ఆయన విగ్రహానికి వేర్వేరుగా పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరికో రాజకీయ ఓనమాలు నేర్పి వరుసగా ఆరు పర్యాయాలు శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యునిగా సేవలందించారని అన్నారు. జిల్లాలో నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, రైల్వే అభివృద్ధి, షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, కాళింగ సంక్షేమ సంఘం అధ్యక్షులు పేడాడ జనార్ధన రావు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద గోపాల్, లఖినేని నారాయణరావు, పైడి శ్రీరాములు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని రాజగోపాలరావు విగ్రహానికి మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు అన్నెపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, నూక సత్యరాజు పాల్గొన్నారు.



ఆమదాలవలస: విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సత్యవతి

పలాస : స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద మాజీ ఎంపీ రాజగోపాల్ విగ్రహానికి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వూసిపి నాయకులు శిష్టు గోపి, బోర బుజ్జి, బల్లయ్య, పోతనపల్లి హరి, మార్పు యుగంధర్, సనపల సింహాచలం పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కూడా రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేశారు.

పన్ను ఎగవేతదారులకు నోటీసులు

శ్రీకాకుళం : నగర కార్పొరేషన్ పరిధిలోని ఇంటి, కుళాయి, ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించాలని ఆర్ఒ ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు పన్నులు చెల్లించని ఇంటి, షాపు యజమానులకు బుధవారం నోటీసులు అందజేశారు. అనంతరం కుళాయి కనెక్షన్ తొలగింపు, షాపులను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సిహెచ్.నరేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసు అందజేస్తున్న ఆర్ఒ ఉమామహేశ్వరరావు

సర్వే చేస్తున్న సిబ్బంది

రాపాకలో పి4 సర్వే

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాకలో పబ్లిక్, ప్రయివేటు పీపుల్స్ పార్టిసిపేట్ సర్వే (పి4) సర్వేను కార్యదర్శి పప్పల శ్రీనివాసరావు ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం చేపట్టారు. పంచాయతీలోని సచివాలయం -1,2 పరిధిలో 1800 గృహాల్లో ఈ సర్వేను చేపడుతున్నామని తెలిపారు. ఇంట్లో ఒక్కరి బయోమెట్రిక్ ద్వారా కాని, ఒటిపి ద్వారా సర్వేలోని 16 అంశాలకు సంబంధించి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వేను ఈ నెల 25లోగా పూర్తిచేయాల్సి ఉందని తెలిపారు. ఈయనతో పాటు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- మందస

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు తప్పనిసరిగా వేయాలని హరిపురం పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు అన్నారు. మందసలో పశువులకు బుధవారం టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది దర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, కళ్యాణ్, లక్ష్మి, హరికృష్ణ, నేతాజీ, పార్వతి, రాజ్యలక్ష్మి, మురళి, ఇంతియాజ్, ఉమా, నిత్యనందం పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

వేలంపాట నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

వేలంపాట వాయిదా

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో సంవత్సర కాలం పట్టణ ఆశీల వసూళ్లు, కమేళా చింతాడ సంతల ఆశీల వసూళ్లకు నిర్వహించిన వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు ప్రకటించారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆధ్వర్యాన మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిధిలో ఆశీల వేలం పాటకు సాల్వెన్సీలు పొంది పాల్గొనవలసిన కాంట్రాక్టరులు ముగ్గురు హాజరయ్యారు. సర్కారు వారి పాట ధరను చూసి వారిలో వారు చర్చించుకొని తర్జన భర్జన పడుతూ ఆశీల పాటలో పాల్గొనేందుకు విముఖత చూపి నిష్క్రమించారు. అలాగే చింతాడ సంత ఆశీల పాటకు సాల్వెన్సీ పొందిన ఇద్దరు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. సర్కారు వారి పాట ధరను చూసి వారూ పాటలో పాల్గొనేందుకు విముఖత చూపి అక్కడ నుంచి నిష్క్రమించారు. ఆశీల పాటలో పాల్గొనవలసిన కాంట్రాక్టు ఎంతసేపటికి వేలం పాటకు హాజరు కాకపోవడంతో చేసేదేమి లేక మున్సిపల్ అధికారులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరలా ఆశీల వేలం పాటను నిర్వహించే తేదీను త్వరలో ప్రకటిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, టౌన్ ప్లానింగ్ అధికారి తమ్మినేని అమర్నాథ్, జామి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలతో పీడీ, టోల్ సిబ్బంది

ప్రయాణాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

కవిటి: ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని బరంపురం ఎన్‌హెచ్ఎఐ పీడీ దర్శిప్రకాష్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వార్షికోత్సవాల్లో భాగంగా కరాపాడు టోల్ ప్లాజాలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందించి ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సిబ్బందిని సత్కరించి బహుమతులు అందించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఇ సాహు, ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్ కుమార్, వివికెవి ప్రసాద్, టోల్ ప్లాజా మేనేజర్ అనీష్ జాన్, రవి కొప్పాల, కిరణ్ కుమార్, బండి చిన్ని, రమేష్‌బాబు టోల్ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రి సందర్శన

పలాస : కాశీబుగ్గ కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు బుధవారం సందర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో చేరుకున్న రెండు డయాలసిస్ యూనిట్లను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి, వ్యాధిగ్రస్థులకు మెరుగైన సేవలందించా లని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్‌కుమార్, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న బాబూరావు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మాజీ సిఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనే లక్ష్యంగా వైసిపిని మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి స్థాపించారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పటి నుంచి ఇప్పటి వరకు భుజస్కందాలపై మోస్తున్న కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, నాయకుల కు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య, ప్రకాశరావు పట్నాయక్, కాళ్ల సత్యం, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, దేవదాసురెడ్డి, పి.రాజశేఖరరెడ్డి నిమ్మన దాస్ ప్రత్తి అన్వేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైసిపి జెండాను టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఆవిష్కరించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

పలాస : వైసిపి ఆవిర్భావం సందర్భంగా ప్రగతి భవనం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, మండల అధ్యక్షులు దువ్వాడ రవికుమార్, గొండు మోహన్, అంబటి ఆనంద్, పవల ప్రసాద్, బెల్లాల శ్రీను, కొర్ల మురళి, బిమ్మిడి దుర్యోధన్, మార్పు యుగంధర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న వైసిపి నాయకులు

నరసన్నపేట : స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపి జెండాను జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆవిష్కరించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి: మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నమని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూప్‌లు ఉన్నాయని అన్నారు. పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 17లోగా apms.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒసి, బిసి, సిడబ్ల్యుసి విద్యార్థులు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150 ఫీజులు చెల్లించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 14న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పలాస ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పూండి, పెద్దమురహరిపురం, అమలపాడు, కె.ఆర్.పేట, పాతటెక్కలి, కొత్తపేట, దేవునల్తాడా తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

సేవలతోనే సంతృప్తి

శ్రీకాకుళం అర్బన్ : సేవలతో సంతృప్తి కలుగుతుందని వైద్యులు, లయన్స్‌క్లబ్ కార్యదర్శి పైడి సిందూర అన్నారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి చెందిన గేదెల చిన్నారావు అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉండడంతో అతనికి బుధవారం ఆస్పత్రి ఆవరణలో చక్రాల కుర్చీ, మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. పాలకొండకు కొవగాన వాసు మూడు చక్రాల కుర్చీని అందించారని, నగరానికి చెందిన సుసరాపు శ్రీలత సరుకులను అందజేసి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అల్లంశెట్టి సంతోష్, దాతలు కొవగాన వాసు, కొవగాన శంకరరావు, ఉర్లాం శివతేజ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, బి.జగదీశ్, పొడుగు చరణ్ పాల్గొన్నారు.

కుక్కల బెడద

కవిటి : మండలంలోని కుక్కల బెడద ఎక్కువగా ఉంటుంది. మాసం దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వాటి వ్యర్థాలను తీనేందుకు ఎగబడుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా బైక్‌దారులు, పాదచారుల వెనుక పరుగులు తీస్తున్నాయి. దీంతో భయాందోళనలు చెందుతున్నారు. వాహనాలపై కుక్కలు రావడంతో కింద పడి గాయపడిన ఘటనలు ఉన్నాయి.

శుభ్రం చేస్తున్న ప్రొక్లెయినర్

పరిశుభ్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- పోలాకి

పోలాకి పంచాయతీలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా పనులు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మజ్జి రమణమ్మ, ప్రతినిధి లక్ష్మీనారాయణ తెలిపారు. పోలాకిలో ప్రొక్లెయినర్‌తో మరుగు కాలువలోని చెత్తా చెదారాలను బుధవారం శుభ్రం చేశారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి బిసి, రాజీవ్ నగర్ కాలనీలు, ప్రధాన మార్కెట్, వెదుళ్లవలసకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు రూ.లక్ష పంచాయతీ నిధులు ఖర్చుపెట్టి శుభ్రం చేయించామన్నారు. ఈ సమస్యలు ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడ్డామని, సర్పంచ్ చొరవతో ఈ సమస్య పరిష్కారమైందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డ్ఇ పద్మావతి, కార్యదర్శి చంద్రరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ పాకివలసలో సర్పంచ్ కోతి చిన్నారావు ఆధ్వర్యాన కార్యదర్శి బాలకృష్ణ బుధవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రెయినేజీలు శుభ్రపరచి, బ్లీచింగ్ చల్లించారు. దోమలు ఎక్కువగా ఉన్న వీధుల్లో దోమల నివారణ మందులను పిచకారి చేశారు. చెత్తను రోడ్డుపైన, డ్రెయినేజీల్లో వేయకూడదని సూచించారు.

ఎత్తిపోతల పథకాలు నిర్మించాలి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలోని వర్షాధార ప్రాంతాల్లో వ్యవసాయానికి అనువుగా అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు అసెంబ్లీ హాల్‌లో సిఎం చంద్రబాబునాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మరమ్మతులకు గురైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు బాగు చేయాలని విన్నవించారు. ఐసిడిఎస్ భవనం, అంగన్వాడీ, మినీ అంగన్వాడీలకు శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు.

వమ్మరవెల్లికి...

శ్రీకాకుళం అర్బన్ : శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబరులో చంద్రబాబును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం కలిశారు. నియోజకవర్గంలో గార మండలం వమ్మరవెల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడానికి నిధుల అవసరమని, వాటిని మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విన్నవించారు. సిఎం సానుకూలంగా స్పందినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

ప్రజాశక్తి- పాతపట్నం

పాఠశాలకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు మార్గంమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యార్థులకు తినుబండారాలు ఆశ చూపుతారని, ఎవరు ఏమి ఇచ్చినా తీసుకోవద్దని ఎస్ఐ బి.లావణ్య సూచించారు. మండలంలోని ఎ.ఎస్.కవిటి ఎంపియుపి పాఠశాలలో బుధవారం సంకల్పంలో భాగా గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటువంటివారు ఎవరైనా పిల్లలకు ఎదురైతే ఉపాధ్యాయులకు గాని, తల్లిదండ్రులకు గాని తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలు, దొంగతనాలు, అపరిచితుల వ్యక్తుల నుంచి కాల్స్ వస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు ప్రజావేదిక

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో 16వ విడత సామాజిక తనికీలపై గురువారం ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మీసాల మన్మథరావథెపిఒ శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ నిధులతో వివిధ విభాగాల సమన్వయంతో చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని 29 పంచాయతీల్లో 1,125 పనులకు గాను, రూ.16,46,38,144 చెల్లించామన్నారు. ఇందులో కూలీల రూపంలో రూ.13,30,90,966, మెటీరియల్ రూపంలో రూ.3,15,47,178 చెల్లించామన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

విద్యార్థులతో మోహనరావు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

ప్రజాశక్తి- కవిటి

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, దానికి ప్రాథమిక విద్యార్థి దశలోనే బీజం పడాలని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, అనకాపల్లి క్రైమ్ బ్రాంచ్ అడిషనల్ ఎస్‌పి లమ్మత మోహనరావు అన్నారు. తాను చదువుకున్న పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. తన గత అనుభవాలు, ప్రస్తుత పరిస్థితులు అన్వయించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మరికొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిరు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు ఆర్థికసాయం

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగకు చెందిన సావిత్రి దలై అనే కిడ్నీ బాధితురాలికి స్థానిక యువత అండగా నిలిచింది. మన గ్రామం - మన బాధ్యత అనే వాట్సప్ గ్రూప్ ద్వారా తక్షణ సహాయంగా బుధవారం రూ.6 వేలు అందించింది. కార్యక్రమంలో స్థానిక యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలకు చైర్ వితరణ

సోంపేట : మండలంలోని కొర్రాయిపేటకు చెందిన శ్యామసుందర్ తన తండ్రి చిన్నయ్య జ్ఞాపకార్థంగా స్థానిక పాఠశాలకు ఆఫీస్ చైర్ బహుమతిగా అందజేశారు. సందర్భంగా బుధవారం ఆఫీస్ చైర్మన్ హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించినందుకు ఆయనను గ్రామస్తులు అభినందించారు.

వాటర్ పైపుల పంపిణీ

బూర్జ : మండలంలోని అల్లినలో బుధవారం రైతులకు సబ్సిడీపై వాటర్ పైపులను టిడిపి మండల అధ్యక్షులు వాగులపల్లి రాంజీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ పనిముట్లను, యంత్రాలను రాయితీపై అందజేస్తుందన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ప్రియాంక, మండల సోషల్ మీడియా ప్రతినిధి వారాడ రాంబాబు పాల్గొన్నారు.

పైపులను అందజేస్తున్న రాంజీ